- 'రచన' ఇంటింటి పత్రిక. నవంబర్, 2004
- కథావాహిని - 2005


# బంధం

జల్లులు జల్లులుగా వాన. ఆగీ ఆగీ వీచే ఈదురుగాలి-

బంగాళాఖాతంలో కేంద్రీకరింపబడిన తుపాను -

టైము తొమ్మిది అయినా ఎంతో రాత్రయిపోయినట్టుంది వాతావరణం.

టీవీలోంచి వచ్చే భయంకరమైన శబ్దాలు. నీతి తప్పిందన్న అనుమానంతో మొదటి భార్యను గొడ్డలితో నరికేసి పరారీ అవుతాడు భర్త. మిగతా కథ మర్నాడే - ఏ విలువల్ని ప్రజలకు చెప్పడానికి ఆ సీరియల్ నిర్మింపబడిందో అర్థం కాలేదు. ధర్మావతికి.

తలుపు చప్పుడైంది.

ఆయన కూడా వూళ్లో లేని యీ రాత్రి ఎవరు చెప్మా? తలుపుల వైపు తదేకంగా చూసింది. మళ్ళీ తలుపు చప్పుడవంతో టీవీ ఆపేసి లేచి వెళ్ళి వీధి కిటికీ రెక్క ఓరగా తెరిచి బయటకు చూసింది. వీధి దీపం వెలుగులో గుమ్మానికి కాస్త ఎడంగా - ఆమె!

'ఎవరూ' అందామనుకున్నా నోటంట మాట రాలేదు - చాలా రోజుల క్రితం చూసినా ఆమెను పోల్చుకోగలదు. సగం తడిసి వుందామె!

వీధి తలుపు గడియ తీయగానే ఆమె చొరవగా లోపలికొచ్చి గోడ కానుకుని నిలుచుంది - నడిచి వచ్చిందేమో ఆయాసపడుతోంది.

బయట ఆకాశంలో పెద్ద మెరుపు. ఆ వెంటనే భయంకరమైన శబ్దం చేస్తూ ఉరుము. చీరకొంగుతో తడిసిన తల నొత్తుకుంటూ "సదాశివంగారున్నారా" అడిగిందామె అతి నెమ్మదిగా.

"పనిమీద హైదరాబాద్ వెళ్ళేరు. రేపు ఉదయం రావొచ్చు" ఆమె మరో ప్రశ్న వేయకుండా జవాబిచ్చింది - ఆమె మౌనంగా తలూకెట్టి గది నంతా పరికిస్తోంది.

ఆయనతో ఆమెకేంపనో ధర్మావతికి తెలుసు. తనతో ఎప్పుడూ ఆమె ఎక్కువగా మాట్లాడింది లేదు. అవసరానికి ఏవో రెండు పొడి పొడి మాటలు. అంతే - అంతకుమించి ఏమున్నాయి గనక?

"తడిసిపోయారు. టవల్ యిస్తానుండండి" అంటూ లోపలికి వెళ్ళింది. వచ్చేసరికి ఆమె ఆ పక్కనే వున్న బల్ల మీద ఓ వారగ కూర్చుని వుంది. లేచి, యిచ్చిన తువ్వాలుతో తల తుడుచుకుని తీగ మీద ఆరేసింది. ఆమెకు ఎటువంటి మర్యాద చెయ్యాలో ధర్మావతికి అర్థం కాలేదు.

ఆయన వుంటే ఆ పరిస్థితి వేరు!

గత పదేళ్ళుగా ఆమెను చూస్తునే వుంది. ఈ పదేళ్ళలోనూ యిది ఏ నాలుగో మారో ఆమె రావడం. ఈ మారు ఆమెలో చాలా మార్పు కనిపిస్తోంది ధర్మావతికి. జుట్టు బాగా నెరిసింది – కళ్ల కింద నీలి వలయాలు – మనిషి కూడా వడిలిపోయి వుంది.

"భోజనం చేస్తారా" అడగకుండా వుండలేకపోయింది.

"వేళ కాని వేళ... మీకు శ్రమేమో.." అన్నదేగాని వద్దనలేదామె.

స్టవ్ మీద చిన్న కుక్కర్‌లో బియ్యం పెట్టింది ధర్మావతి. ఆధరవులు ఉన్నాయి.

కాస్సేపయ్యాక, "పాపేదీ?" అడిగిందామె భోజనానికి కూర్చుంటూ.

"వర్షం కదా. ఈ రోజు పెందరాళే అన్నం తినేసి పడుకుంది" అంది.

భోజనం చేస్తున్నంత సేపూ మరేం మాట్లాడలేదామె.

"బోసుబాబు ఈ మధ్య వచ్చి వెళ్ళేడా?" చేయి కడుక్కుని బల్ల మీద కూర్చున్నాక అడిగింది.

ఊహించిన ప్రశ్నే అయినా ఏం చెప్పాలో అర్థం కాలేదు ధర్మావతికి. అసలు వాస్తవం చెప్పాలా వద్దా అనే సందిగ్ధంలో కూడా పడింది. జవాబులున్నా కొన్ని సందర్భాల్లో కొన్ని ప్రశ్నలకు ఎలా జవాబు చెప్పాలో తెలియని పరిస్థితి ఏర్పడుతుంది.

"లేదు. రెండేళ్ళ క్రితం రావడమే" – ధర్మావతి గొంతు వణికింది.

బయట వర్షం హెచ్చింది – ఎక్కడో వురుము పడ్డ చప్పుడు –

"పొద్దుపోయింది. మీరా మధ్యగదిలో పడుకోండి. మంచం వుంది" అంది టాపిక్ మార్చాలనే ఉద్దేశ్యంతో.

ఆమెలో ఏదో సంశయం పొడ చూపినట్లు గ్రహించింది ధర్మావతి. ఇంకా ఏవైనా ప్రశ్నలు వేస్తుందా?

తమ సంసారం గురించి ఆమె ఎప్పుడూ అడగలేదు – ఈ రోజు తను వంటరిగా కూడా దొరికింది. ఒక వేళ అడిగితే...? ఎలా అడుగుతుందీ? – ధర్మావతి మస్తిష్కంలో ఎన్నో ప్రశ్నలు.

ఈ రాత్రి గడిచిపోతే చాలును. రేపు ఉదయం ఆయనొచ్చి చూసుకుంటారు.

ఆమె మౌనంగా దేన్నో వెదుకుతున్నట్లనిపించింది ధర్మావతికి.

"మీ చీర తడిసిపోయింది... నా చీర కట్టుకుంటారో లేదో.. ఇస్త్రీ చీరొకటి మంచం మీద పెట్టేను" అంది -

ఆమె ఏం మాట్లాడలేదు.

గోడకున్న ఎలక్ట్రానిక్ వాచీ పదిన్నర సూచిస్తోంది.

ఇక తప్పదన్నట్లు ఆమె గది వైపు మర్లబోతూ-

"ఆయన రేపు ఎన్ని గంటలకు రావొచ్చు" అడిగింది -

"వస్తే ఎనిమిది గంటల ప్రాంతంలోనే - లేదా రాత్రే."

వీధి తలుపులు వేసి, లైటు ఆర్పేసి, తన గదిలోకి వెళ్ళింది ధర్మావతి. బయట వర్షం పడుతున్న చప్పుడు వినిపిస్తూనే వుంది. మంచం మీద పాప గాఢంగా నిద్ర పోతోంది.

పడుకున్నదన్నమాటే గాని ధర్మావతికి ఒకంతట నిద్ర పట్టలేదు - ఇప్పటి యీ పరిస్థితి గురించి కాకపోయినా ఆమెను గురించిన కొన్ని ఆలోచనలు యిబ్బందికరంగా చుట్టుముడుతూనే వున్నాయి.

తెలిసి చేసినా తెలియక చేసినా తప్పు తప్పే. అది మనిషిని ఒక్కోప్పుడు జీవితాంతం వెన్నంటే వుంటుంది, దాని ప్రతిఫలం అనుభవించేవరకూ.

ఆమెను గురించిన ఏవేవో పుకార్లు, నిందలు... తమ పెళ్లయిన కొత్తలోనే వింది తను. దేవుడు లాంటి భర్త. రత్నం లాంటి బిడ్డ. పూర్వజన్మ ఖర్మం కాకపోతే ఏమిటి? లోకం మాటెలా ఉన్నా తనకు తానే శిక్షను విధించుకున్న ఆమె మనోబలం తననెప్పుడూ ఆమెను గౌరవించేలానే చేస్తాయి.

ఆలోచనల్లో ఎప్పుడు పట్టిందో నిద్ర... అర్ధరాత్రి దాటింది. ఎక్కడో పిడుగు పడ్డ శబ్దమైతే ఉలిక్కిపడి లేచింది ధర్మావతి. బయట వర్షం కురుస్తూనే వుంది. నెమ్మదిగా లేచి తలుపు రెక్క ఓరగా తెరిచి చూసింది. ఆమె గదిలో జీరో వోల్టు బల్బు వెలుగుతోంది.

ఆమె నిద్రపోనే లేదా? లేక తనలాగే లేచిందా? వాచీ వంక చూసింది. తెల్లవారదానికింకా చాలా టైముంది.

తలుపు జారవేసి మంచం మీదికి చేరింది.

బోసుబాబు ఆర్మీలో చేరడం ఆయనకు సుతారమూ యిష్టం లేదు. చదువుకుంటే ఉన్నతోద్యోగాలు చేయగల తెలివితేటలున్నవాడు. అయినప్పటికీ పట్టుదలగా ఒక నిశ్చయానికి వచ్చాడు. మానసికంగా అతనిలో వచ్చిన కొన్ని మార్పులకు అతని నిర్ణయం ఒక పరిష్కారాన్ని చూపగలదేమో అనిపించింది.

...మళ్లీ నిద్ర.. ఉదయం పాలవాడు తలుపు తడుతూంటే మెలకువ వచ్చింది. అలవాటైన అలారం అది– పాలు పోయించుకుని వస్తూంటే గదిలో ఆమె లేచిన సవ్వడి.

వంటింట్లోకి వెళ్ళి కాఫీకి డికాక్షన్ వేసి పెరట్లోకి వెళ్ళింది. వాన వెలిసి, తూర్పు తెల్లబడుతోంది. బాత్రూంలో ముఖం కడుక్కుని వచ్చి పాలు కాచి, కాఫీ కలిపే ముందు మధ్య గదిలోకి తొంగి చూసింది. గది తలుపులు తెరిచి వున్నాయి. లోపల దీపం వెలుగుతోంది. ఆమె మాత్రం గదిలో లేదు. అనుమానంగా యిల్లంతా కలయదిరిగి అప్పుడు చూసింది వీధి గుమ్మంవైపు. గడియ తీసి వుంది. తలుపులు మాత్రం దగ్గరగా వేసి వున్నాయి. గుమ్మంలోంచి వీధిలోకి చూసింది. ఆమె జాడలేదు!

ఆమె వెళ్లిపోయిందా?

చటుక్కున తన గదిలోకి వెళ్ళి చూసింది. పాప నిద్ర పోతోంది. అయితే వూహించినదే జరిగింది – గుమ్మానికెదురుగా వున్న చిన్న బీరువా మీది బోసుబాబు పెద్ద సైజు ఫోటో లేదు. దానికి వేసిన దండా లేదు – తానామె నుండి ఏదైతే దాచాలని ప్రయత్నించిందో అదే దాచలేకపోయింది. అపరాధ భావంతో ధర్మావతి మనసు కళవెళ పడింది – నిజం తెలిసి ఆమె మనసు ఎలా క్షోభించిందో! ఆ క్షోభనూ, అంతరంగంలోని కదలికలనూ బాహాటం చేయకుండా భరించగలిగే నిబ్బరాన్ని ఆమె ఎలా అలవర్చుకుందో! అనుభవసారమే జీవితమనడానికి ఆమె జీవన మార్గమే నిర్వచనమా?

ఎనిమిది గంటల ప్రాంతంలో సదాశివం వచ్చాడు. కాఫీ తాగి అతను తన ప్రయాణ విశేషాలను చెబుతున్నంత సేపూ ఆమె మౌనంగానే వుండిపోయింది. పాప స్కూలుకి వెళ్ళేక స్నానానికి లేచాడు సదాశివం. ధర్మావతిలోని మౌనం అతనిలో ఏదో సందేహానికి తావిచ్చింది. స్నానం కానిచ్చి గదిలోకొచ్చాక గాని ఆ సందేహానికి ఆలంబన దొరకలేదు.

"ధర్మా! బోసుబాబు ఫోటో ఎక్కడ?" అరిచినంత పనిచేశాడు.

ధర్మావతి గది గుమ్మం వరకూ వచ్చి ఆగింది. మాటరాని మౌనంతో తలొంచుకుంది. ఆమె తీసి వేరే చోట పెట్టి వుంటుందన్న అనుమానం అతనికి లేదు–

అతనికేదో అర్థమౌతోంది. అందుకే ఈ మారు స్వరం తగ్గించి అనునయంగా అడిగాడు.

"ఫోటో ఏమైంది ధర్మా?" ఎవరన్నా వచ్చారా?"

అవునన్నట్లుగా తలూపి, "రాత్రి... ఆమె వచ్చారు..." అంది నెమ్మదిగా. ఎవరన్నట్లు ఆశ్చర్యంగా ఆమె కళ్ళలోకి చూశాడు సదాశివం.

కాస్సేపు మౌనం తర్వాత ధర్మావతి అంది –

"ఆమే ... అరుంధతిగారు... మీ మొదటి భార్య!"

◆ ❖ ◆